PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

విజయవాడ,హైదరాబాద్ సంపుటి 01 సంచిక 79 ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు గురువారం 25 జూన్ 2026 వెల -3 పేజీలు -8

## ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి బంపర్ గిఫ్ట్..

## రూపాయి ప్రీమియం లేకుండా

## రూ.1.2 కోట్ల ఉచిత బీమా!

దాదాపు 10 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత ప్రమాద బీమా పథకం

అధికారికంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గురువారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో 14 బ్యాంకులతో ఒప్పందం

ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.1.2 కోట్లు, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2 కోట్ల వరకు పరిహారం

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందికీ బీమా

# దేశమంతా ఇక 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుతుంది: జొన్నగిరిలో సీఎం చంద్రబాబు



కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ప్రారంభం

జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ప్రకటించిన సీఎం చంద్రబాబు

రాబోయే రోజుల్లో స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్

5000 మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని హామీ

రాయలసీమను 'రత్నాల సీమ'గా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి

గత ప్రభుత్వంపై, గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన చంద్రబాబు




కర్నూలు జిల్లా తుగ్గలి

రాయలసీమ చరిత్రలో ఒక సరికొత్త సువర్ణాధ్యాయం ప్రారంభమైంది. కర్నూలు 2

## తెలంగాణలో జనసేన జోరు... భారీ చేరికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన పవన్ కల్యాణ్

తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టిన పవన్ కల్యాణ్

తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం



తెలంగాణ

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన ఫోకస్ పెంచింది. తెలంగాణలో పార్టీ 2

## పోలవరం ప్రాంతంలో పెద్దపులి సంచారం.. 11 గ్రామాలకు హై అలర్ట్

పాపికొండలు నేషనల్ పార్క్ పరిధిలో సంచరిస్తున్న పెద్దపులి

పర్యాటక బోట్లు, మత్స్యకారుల చేపల వేటను రద్దు చేసిన అధికారులు

అడవిలోకి ఎవరూ ఒంటరిగా వెళ్లొద్దని హెచ్చరిక

ఏలూరు జిల్లా పోలవరం



ఏలూరు జిల్లా పోలవరం మండలం, పాపికొండలు నేషనల్ పార్క్ పరిధిలో ఒక 2

## అందుకే విద్యాశాఖను ఎంచుకున్నా.. విద్యార్థులు చదవకపోతే సీఎం నాకు మైనస్ మార్కులు వేస్తారు: మంత్రి లోకేశ్

సంస్కరణలు పూర్తయ్యాయని, ఇక ఉపాధ్యాయులు బోధనపైనే శ్రద్ధ పెట్టాలని సూచన

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమష్టి కృషితో ఏపీ మోడల్ విద్యను సాధిద్దామని పిలుపు

లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు నేరుగా తనతో సమస్యలు పంచుకోవచ్చని వెల్లడి

కొక్కిలిగడ్డ హైస్కూలులో రూ.1.4 కోట్లతో నిర్మించిన నూతన భవనాల ప్రారంభోత్సవం

కొక్కిలిగడ్డ

సమాజంలో మార్పు తీసుకురావాలనే బలమైన ఆకాంక్షతోనే తాను అత్యంత సవాలుతో కూడుకున్న విద్యాశాఖను ఎంచుకున్నానని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్యావ్యవస్థలో సంస్కరణల దశ పూర్తయిందని, ఇకపై ఉపాధ్యాయులు పూర్తిగా బోధన, ఫలితాలపైనే దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు ఒక బృందంగా పనిచేసి దేశంలోనే ఆదర్శవంతమైన 'ఏపీ మోడల్ ఎడ్యుకేషన్'ను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. 2



## హర్మ్యూజ్ జలసంధి మూసివేత: రూ. 10 లక్షల కోట్ల సరుకుతో నిలిచిపోయిన 1,200 నౌకలు!

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మొదలైన సంక్షోభం

హర్మ్యూజ్ జలసంధి మూసివేతతో నిలిచిపోయిన చమురు సరఫరా

ఉద్రిక్తతలతో 100 డాలర్ల మార్కును దాటిన బ్యారెల్ ముడిచమురు ధర

సముద్రంలో నెలల తరబడి చిక్కుకుపోయిన 20 వేల మంది నావికులు

ఇరాన్

ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గమైన 'హర్మ్యూజ్ జలసంధి'సుదీర్ఘ మూసివేతతో అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పర్షియన్ గల్ఫ్‌లో దాదాపు 125 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 10.4 లక్షల కోట్లు) విలువైన సరుకుతో ఉన్న 1,200కి పైగా సరుకు రవాణా నౌకలు అక్కడే నిలిచిపోయినట్లు సముద్ర బీమా సంస్థలు, షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ అంతర్జాతీయ జలమార్గం గుండా రవాణా పూర్తిగా నిలిచిపోయింది.

ప్రపంచవ్యాప్తంగా సరఫరా




2

## ఒకే వేదికపైకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు

రేపు తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

హాజరుకానున్న తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు కర్ణాటక సీఎం డీకే శివకుమార్

రూ. 51 కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి

2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ఠ చర్యలు

హోస్పేటలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్న నేతలు

తుంగభద్ర

ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త జవసత్వాలు రానున్నాయి. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన స్పిల్‌వే గేట్లను రేపు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా పాల్గొంటారు. మూడు రాష్ట్రాలకు చెందిన కీలక నేతల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.



తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తం రూ. 51 కోట్ల వ్యయంతో 33 కొత్త స్పిల్‌వే గేట్లను ఏర్పాటు చేశారు. 2024 2

# దేశమంతా ఇక 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుతుంది: జొన్నగిరిలో సీఎం చంద్రబాబు

జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ చారిత్రక సందర్భంలో జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దేశమంతా ఇక 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సహచర మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, భరత్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, జియో మైసూర్ సంస్థ ప్రతినిధులు, త్రివేణి ఎర్త్‌మూవర్స్ ఎండీ ప్రభాకరన్ హాజరయ్యారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, 'రత్నాల సీమ'గా మారుతుందన్న ఆశాభావాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు.

రాయలసీమలో సరికొత్త సువర్ణాధ్యాయం

దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును జొన్నగిరిలో ప్రారంభించడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు విస్తరణ యూనిట్‌కు కూడా శంకుస్థాపన చేశామని తెలిపారు. జియో మైసూర్ సర్వీసెస్, త్రివేణి ఎర్త్‌మూవర్స్ సంస్థలను ఆయన అభినందించారు. "ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ద్వారా 400 కేజీల బంగారం ఉత్పత్తి ప్రారంభమైంది. ఇది త్వరలోనే 1000 కిలోలకు (ఒక టన్ను) చేరుకుంటుంది. రెండో యూనిట్ కూడా పూర్తయితే ఇక్కడి నుంచే 50 మెట్రిక్ టన్నుల బంగారం ఉత్పత్తి చేయబోతున్నాం. ఇది ఒక చరిత్ర" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని, త్వరలోనే ఈ సంఖ్య 1500కు, భవిష్యత్తులో 5000కు చేరుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

జొన్నగిరి కాదు.. ఇకపై స్వర్ణగిరి

ఈ ప్రాంతానికి వందల ఏళ్ల చరిత్ర ఉందని, అశోకుడి కాలంలో దీనిని 'సువర్ణగిరి' అని పిలిచేవారని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రజల ఆమోదంతో జొన్నగిరి పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ప్రకటించారు. "ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 గురించి కలలు కంటున్నారు. నా ఆలోచన వికసిత్ భారత్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడం. దానికి ఈరోజే ఇక్కడ నాంది పలుకుతున్నాం" అని చంద్రబాబు అన్నారు. స్వర్ణగిరి గ్రామాన్ని దత్తత తీసుకుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని త్రివేణి ఎండీ ప్రభాకరన్‌ను కోరగా, ఆయన అంగీకరించారని తెలిపారు.

ఇక దేశమంతా స్వర్ణగిరి వైపే చూస్తుంది

ఒకప్పుడు దేశంలో కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్) గురించి మాట్లాడుకునేవారని, ఇకపై దేశమంతా 'స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్' గురించే మాట్లాడుకుంటుందని చంద్రబాబు అన్నారు. "ప్రపంచానికి కోహినూర్ వజ్రాన్ని అందించింది మన రాష్ట్రమే. ఇప్పుడు దేశం ఏటా 80,800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. ఈ దిగుమతులను తగ్గించడంలో స్వర్ణగిరి కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇక్కడే ఒక బృహత్తరమైన జువెలరీ పార్క్ ఏర్పాటు చేసి, ప్రపంచానికి కావాల్సిన ఆభరణాలు స్వర్ణగిరి నుంచే సరఫరా అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు.

రత్నాల సీమగా రాయలసీమ.. ఇదే మా విజన్

రాయలసీమ అంటే రాళ్ల సీమ కాదని, రత్నాల సీమగా మార్చి చూపిస్తానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్ జెట్లు తయారవుతాయి. అనంతపురంలో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ హబ్‌లు వస్తున్నాయి. కియా మోటార్స్, సిమెంట్, స్టీల్ పరిశ్రమలతో పాటు సోలార్, విండ్ ఎనర్జీకి రాయలసీమ కేంద్రంగా మారుతుంది," అని భరోసా ఇచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని, 2028 నాటికి కడపలో స్టీల్ ప్లాంట్ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు

ఈ సందర్భంగా వైసీపీపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గత ప్రభుత్వం వాటాల కోసం, అక్రమ సంపాదన కోసం పరిశ్రమలను వేధించి తరిమేసింది. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు. గొడ్డలి పార్టీకి విధ్వంసమే విజన్, ఫేక్ ప్రచారమే విధానం, రప్పాడించే రాజకీయాలే మేనిఫెస్టో" అని దుయ్యబట్టారు. బాబాయ్ హత్య కేసును ప్రస్తావిస్తూ, ఆ నేరాన్ని తనపై వేయడానికి ప్రయత్నించారని, అలాంటి ప్రమాదకరమైన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని, దేవుడి విషయంలో అపచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇస్తే, దానిపై కూడా కుట్రలు చేసి పేపర్ లీక్ అయిందని ఫేక్ ప్రచారం చేశారని మండిపడ్డారు. డీఎస్సీ పరీక్ష జరిగిన ఏడాది తర్వాత పేపర్ లీక్ అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తుంటే, గొడ్డలి పార్టీ కులం, మతం, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తోందని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని, త్వరలోనే ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజల ముందు ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి బంపర్ గిఫ్ట్.. రూపాయి ప్రీమియం లేకుండా రూ.1.2 కోట్ల ఉచిత బీమా!

తెలంగాణ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలలో ఆర్థిక భద్రతను పెంపొందించే దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో అద్భుతమైన సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన సమగ్ర ఉచిత ప్రమాద బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 14 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయనుంది. ఉద్యోగులపై కానీ, ప్రభుత్వ ఖజానాపై కానీ ఎలాంటి ప్రీమియం భారం పడకుండా కేవలం జీతాల ఖాతాలు ఉండే బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఈ ఉచిత బీమాను అందించడం దేశ చరిత్రలోనే ఇది మొదటిసారి కావడం విశేషం.

ఈ సరికొత్త బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందితో కలిపి దాదాపు 10 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. బ్యాంక్ ఖాతాల ద్వారా జీతాలు పొందే ప్రతి ఉద్యోగికి ఈ రక్షణ లభిస్తుంది. ఉద్యోగి జీతం పొందే బ్యాంకు నిబంధనలను బట్టి ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం రూ.60 లక్షల నుండి గరిష్టంగా రూ.1.2 కోట్ల వరకు వారి కుటుంబ సభ్యులకు పరిహారం అందుతుంది. ఒకవేళ విమాన ప్రమాదంలో మరణిస్తే ఈ పరిహారాన్ని రూ.2 కోట్లకు పెంచారు. గతంలో సింగరేణి కాలరీస్ కార్మికులకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ విధానాన్ని అమలు చేయగా, అక్కడ దురదృష్టవశాత్తు మరణించిన సుమారు 45 మంది కార్మికుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందింది. ఈ పథకం విజయవంతం కావడంతో ప్రభుత్వం ఇప్పుడు దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలోనే ఉద్యోగుల ప్రమాద బీమా పథకానికి ఆమోదం లభించింది. ఇప్పుడు పరిపాలనాపరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని ఇది కార్యరూపం దాల్చుతోంది. ఈ బీమాతో పాటు సహజ మరణం సంభవిస్తే (60 ఏళ్ల లోపు) రూ.10 లక్షల టర్మ్ లైఫ్ కవర్ కూడా ఉద్యోగులకు లభించనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవో)తో పాటు వివిధ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. రవీంద్రభారతిలో జరిగే ప్రారంభోత్సవానికి ఉద్యోగులందరూ తమ గుర్తింపు కార్డులతో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, జులై మొదటి వారంలో పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించి ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ డిజిటల్ హెల్త్ కార్డులను (ఈహెచ్ఎస్) కూడా పంపిణీ చేయడానికి, కొత్త పీఆర్సీ అమలుపై దృష్టి పెట్టడానికి రేవంత్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది.

# తెలంగాణలో జనసేన జోరు... భారీ చేరికలు

ఉనికిని చాటడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేందుకు జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ మొదలుపెట్టారు.

రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ఇతర పార్టీల నుండి వచ్చే వలసలను సమన్వయం చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన 'తెలంగాణ జాయినింగ్స్ కమిటీ'ని అధికారికంగా నియమించారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులవుతున్న విద్యావంతులు, సామాజికవేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, తటస్థులను లైన్‌లోకి తెచ్చే బాధ్యతను ఈ ఏడుగురు సభ్యులకు అప్పగించారు.

తెలంగాణ జాయినింగ్స్ కమిటీ సభ్యులు:

ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

డా. గడల శ్రీనివాస్ (తెలంగాణ రాష్ట్ర మాజీ మెడికల్ డైరెక్టర్)

గొట్టిముక్కల నరేష్ రెడ్డి

అబ్దుల్ హనీఫ్

అల్లాడి తనీష్ (సినీ నటుడు)

చిరాగ్ ప్రజీత్ గౌడ్

మేడూరి సరస్వతి (తెలంగాణ రాష్ట్ర మాజీ డీసీపీ)

తెలంగాణ వ్యాప్తంగా వస్తున్న చేరికల విజ్ఞప్తులను ఈ జాయినింగ్స్ కమిటీ మొదట క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ తర్వాత ఆ రిపోర్టులను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి క్లియరెన్స్ చేసి, నేరుగా అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తారు. అనంతరం పవన్ ఇచ్చే దిశా నిర్దేశం మేరకు త్వరలోనే హైదరాబాద్ వేదికగా భారీ ఎత్తున చేరికల కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించనున్నారు.

# విద్యార్థులు చదవకపోతే సీఎం నాకు మైనస్ మార్కులు వేస్తారు: మంత్రి లోకేశ్

అవనిగడ్డ నియోజకవర్గం, మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో 'పి4' పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాలను మంత్రి లోకేశ్ నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గత రెండేళ్లలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు (హార్డ్‌వేర్) గణనీయంగా మెరుగుపర్చామని, ఇప్పుడు అభ్యసన ఫలితాలు (సాఫ్ట్‌వేర్) మెరుగుపర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు.

"కొక్కిలిగడ్డ హైస్కూలులో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ మినహా అన్ని సౌకర్యాలు కల్పించాం. ఇక మీరు ఫలితాలపై దృష్టి పెట్టాలి. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సు మెటీరియల్ అందించి వారి సామర్థ్యాన్ని పెంచాలి. నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి" అని లోకేశ్ సూచించారు.

ఉపాధ్యాయులతో ప్రత్యక్ష సంప్రదింపులకు 'లీప్ యాప్'

విధి నిర్వహణలో ఉపాధ్యాయులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఎంఈఓ, డీఈఓల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, నేరుగా 'లీప్ యాప్' ద్వారా తన దృష్టికి తీసుకురావచ్చని లోకేశ్ భరోసా ఇచ్చారు. వచ్చే నెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని, తల్లిదండ్రుల స్మార్ట్‌ఫోన్లలో లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల చిత్రాలతో పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం ద్వారా వారిని ప్రోత్సహిస్తున్నామని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా కొందరు ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మెగా డీఎస్సీని కేవలం 155 రోజుల్లో పారదర్శకంగా పూర్తి చేసి, తమ కలలను సాకారం చేసినందుకు స్కూల్ అసిస్టెంట్ మనీష మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపడటంతో ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 39 మంది కొత్తగా చేరారని టీచర్ షర్మిల చెప్పగా, మంత్రి వారిని అభినందించారు. పాఠశాలకు ప్లేగ్రౌండ్, పాల్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా, త్వరలోనే వాటిని సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో 'క్లిక్కర్ టెక్నాలజీ'ని కూడా అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

మీరు చదవకపోతే సీఎం నాకు మైనస్ మార్కులు వేస్తారు!

అనంతరం 9, 10వ తరగతి విద్యార్థులతో లోకేశ్ సరదాగా ముచ్చటించారు. "దాతల సహకారంతో మీకు అద్భుతమైన భవనాలు సమకూరాయి. మీరు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధిస్తే ముఖ్యమంత్రి గారు నాకు మంచి మార్కులు వేస్తారు. ఒకవేళ మీరు సరిగా చదవకపోతే ఆయన నాకు మైనస్ మార్కులు వేస్తారు. నా భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని చమత్కరించడంతో విద్యార్థులు నవ్వుల్లో మునిగిపోయారు.

విద్యార్థులకు ఇప్పటికే యూనిఫాం, పుస్తకాలు ఇచ్చామని, త్వరలోనే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్స్, బూట్లు కూడా అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత అత్యంత గౌరవనీయులు ఉపాధ్యాయులేనని, వారిని గౌరవిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే వేదికపైకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు

ఆగస్టులో సంభవించిన వరదల సమయంలో ప్రాజెక్టు 19వ నంబర్ గేటు కొట్టుకుపోయింది. ఇది తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆ సమయంలో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వంలోని సాంకేతిక బృందం తాత్కాలికంగా స్టాప్-లాక్ గేటును ఏర్పాటు చేసి నీటిని నియంత్రించింది. ఈ ఘటన అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి ప్రాజెక్టును పరిశీలించింది. భద్రతా కారణాల దృష్ట్యా పాత గేట్లన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.

ఈ సిఫార్సుల మేరకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు సంయుక్తంగా పనులు చేపట్టాయి. యుద్ధప్రాతిపదికన కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 33 కొత్త గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేశాయి. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో వరదల సమయంలో నీటి ప్రవాహాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని, నీటి వృథాను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు.

రాయలసీమకు జీవనాడిగా భావించే ఈ ప్రాజెక్టు ద్వారా కుడి ప్రధాన కాలువ కింద కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సుమారు 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. అనేక గ్రామాలకు తాగునీటి అవసరాలు కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోంది. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం నేతలందరూ హోస్పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

# హర్మూజ్ జలసంధి మూసివేత: రూ. 10 లక్షల కోట్ల సరుకుతో నిలిచిపోయిన 1,200 నౌకలు!

అయ్యే ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)లో ఐదో వంతు వాటా ఈ ఇరుకైన జలసంధి గుండానే సాగుతుంది. ఫిబ్రవరి 2026 చివరలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు చేయడంతో ఈ సంక్షోభం ప్రారంభమైంది. జూన్ మధ్యలో అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయంటూ ఇరాన్ చేసిన తాజా ప్రకటనలు మళ్లీ ఆందోళనలను పెంచాయి.

సంక్షోభ తీవ్రత - నావికుల ఇబ్బందులు

అలియాంజ్ కమర్షియల్ సేఫ్టీ అండ్ షిప్పింగ్ నివేదిక ప్రకారం.. జూన్ మధ్య నాటికి సుమారు 29 మిలియన్ గ్రాస్ టన్నుల బరువున్న 1,150 నుండి 1,200 సరుకు రవాణా నౌకలు నిలిచిపోయాయి. వీటితో పాటు దాదాపు 20,000 మంది నావికులు నెలల తరబడి సముద్రంలోనే చిక్కుకుపోయారు. ఆహార కొరత, మానవీయ సంక్షోభం ఎదుర్కొంటున్న ఈ సిబ్బందిని సురక్షితంగా తరలించేందుకు ఒమన్ దేశం సమన్వయంతో ఒక ప్రత్యేక తరలింపు కారిడార్‌ను ఏర్పాటు చేశారు. ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో జరిగిన దాడుల్లో 40కి పైగా నౌకలు దెబ్బతినగా, కనీసం 14 మంది నావికులు మరణించారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఈ జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ముడి చమురు ధర కొన్ని సందర్భాల్లో బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిపోయింది. నౌకలను ఆఫ్రికా చుట్టూ లేదా ప్రత్యామ్నాయ భూమార్గాల ద్వారా మళ్లించాల్సి రావడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి, సరుకు సరఫరా ఆలస్యమవుతోంది. దాదాపు 3,00,000 కంటైనర్ కార్గో ఇంకా అక్కడే చిక్కుకుపోవడంతో ప్రాంతీయ ఓడరేవులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఉష్ణోగ్రతలకు దెబ్బతినే వస్తువులు, పాడైపోయే ఆహార పదార్థాల వల్ల బీమా క్లెయిమ్‌లు భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తాజా పరిస్థితి.. రికవరీ ప్రయత్నాలు

జూన్ చివరి వారంలో గల్ఫ్ నుండి నౌకల రాకపోకలు కొంతవరకు పెరిగినట్లు షిప్పింగ్ డేటా సూచిస్తోంది. అయితే, లెబనాన్‌లో జరిగిన ఉల్లంఘనల కారణంగా ఈ మార్గాన్ని మళ్లీ మూసివేస్తామని ఇరాన్ ప్రకటించడం అనిశ్చితిని పెంచింది. అయితే కొన్ని నౌకల రాకపోకలు సాగుతున్నట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు. హర్మూజ్, సూయజ్ కాలువ వంటి కీలక జలమార్గాలపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన అవసరాన్ని ఈ సంక్షోభం గుర్తుచేస్తోందని షిప్పింగ్ రంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# మంగళగిరిలో ఏపీఎల్ సందడి... ట్రోఫీ ఆవిష్కరించిన రామ్ చరణ్

మంగళగిరి స్టేడియంలో ఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించిన రామ్ చరణ్

యువ ప్రతిభను వెలికితీయడానికి ఈ లీగ్ గొప్ప వేదిక అన్న గ్లోబల్ స్టార్

ప్రారంభమైన భీమవరం బుల్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్ మ్యాచ్

జూన్ 30న ఏపీఎల్ ఫైనల్ మ్యాచ్

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి, ఏసీఏ అధ్యక్షుడు

# ఈ సినిమా హాలీవుడ్ హద్దులను చెరిపేసింది: ప్రియాంక చోప్రా



'అబ్సెషన్'లా చిన్న సినిమాతోనూ పెద్ద విజయం సాధ్యమన్న ప్రియాంక
ఒక ఐడియా ఉంటే చాలు, యూట్యూబ్ వీడియోతోనూ సక్సెస్ కావచ్చని వ్యాఖ్య
పరిశ్రమలోకి వచ్చినప్పుడు తనకు ఎలాంటి కనెక్షన్లు లేవని గుర్తు చేసుకున్న నటి
కొత్త ఫిలిం మేకర్స్‌ను ప్రోత్సహించడానికే ప్రొడక్షన్ హౌస్ ప్రారంభించానని వెల్లడి
హాలీవుడ్‌లో ఇంకా విభిన్న పాత్రలు చేయాలనుకుంటున్నట్టు తెలిపిన ప్రియాంక

వరల్డ్ స్టార్ ప్రియాంక చోప్రా, చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టాలనుకునే కొత్త టాలెంట్‌కు ఇప్పుడు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక మంచి ఆలోచన ఉంటే చాలు, తక్కువ బడ్జెట్‌తోనూ ప్రపంచవ్యాప్తంగా విజయం సాధించవచ్చని, ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన హారర్ సినిమా 'అబ్సెషన్' దీనికి చక్కటి ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు. బుధవారం కేన్స్ లయన్స్ సదస్సులో పాల్గొన్న ప్రియాంక, మారుతున్న సినిమా ప్రపంచంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అబ్సెషన్' వంటి సినిమాలతో హాలీవుడ్ హద్దులు చెరిగిపోతున్నాయని అభిప్రాయపడ్డారు.

"మీ దగ్గర ఒక ఐడియా ఉంటే, దాన్ని షూట్ చేసి యూట్యూబ్‌లో పెట్టండి. అది 'అబ్సెషన్' లాంటి పెద్ద హిట్ సినిమా కూడా కావచ్చు. వినోద రంగంలో ఉండటానికి ఇది సరైన సమయం, ఎందుకంటే ఇప్పుడు మీ ఆలోచనలే మీ ఆస్తి" అని ప్రియాంక తెలిపారు. ఒకప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదని ఆమె గుర్తుచేసుకున్నారు.

గత పదేళ్లుగా హాలీవుడ్‌లో కెరీర్ నిర్మించుకుంటున్న ప్రియాంక, తాను పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు. "మా తల్లిదండ్రులు డాక్టర్లు. మాకు ఇండస్ట్రీలో ఎవరూ తెలియదు, ఎలా ముందుకు వెళ్లాలో కూడా అవగాహన లేదు. అప్పట్లో సినిమా అనేది కొందరికే పరిమితమైన రంగం" అని అన్నారు.

తన కెరీర్ తొలినాళ్లలో భారతీయ సినిమాలు ఎప్పటికీ హాలీవుడ్ అంతటి ప్రపంచ స్థాయికి చేరలేవని చాలామంది అనేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్త ఫిల్మ్ మేకర్స్‌ను, మంచి ఐడియాలు ఉండి అవకాశాలు రాని వారిని ప్రోత్సహించేందుకు తాను నిర్మాణ సంస్థను ప్రారంభించినట్టు వెల్లడించారు. హిందీలో ఎందరో గొప్ప దర్శకులు, నటులతో పనిచేశానని, కానీ హాలీవుడ్‌లో ఆ స్థాయిలో ఇంకా విభిన్నమైన పాత్రలు చేయలేదని, ఆ దిశగా ప్రయత్నిస్తున్నానని ప్రియాంక తెలిపారు. స్ట్రీమింగ్ సర్వీసులు, కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు అన్ని భాషల కంటెంట్‌ను చూడటం మొదలుపెట్టారని ఆమె అభిప్రాయపడ్డారు

# యూరియా కొరత లేదు- ఎమ్మెల్యే బీవీ
## ఎరువుల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు,(కింగ్ )



యూరియా కొరత లేదని, పుష్కలంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కే తిమ్మాపురం గ్రామంలోయూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో, కడివెంట్ల సొసైటీలో, ఎమ్మిగనూరు మండలంలోని రిటైల్ షాపుల్లో యూరియా, ఎరువులు డిపి పుష్కలంగా ఉన్నాయి. కావలసిన రైతులు మీ రైతు సేవ కేంద్రం దగ్గరకు వెళ్లిన ఎరువులు ఇస్తారు. ఒకవేళ మీకు రిటైల్ షాప్ దగ్గర వెళ్లిన ఎరువులు ఇవ్వబడును, ఏపీఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా మాత్రమే యూరియా, డిఏపి ఇవ్వబడును. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు. మీ పంటకు తగ్గ ఎరువులు ఇవ్వబడునున్నారు. రిటైల్ షాపు డీలర్లకు తెలియజేయడమేమనగా రైతులందరికీ ఎరువులు రైతులు ఎరువులు అడిగినవి మాత్రమే ఇవ్వవలెను, లింకు పెట్టి ఇతర ప్రొడక్ట్స్ లేక బయో ప్రొడక్ట్స్ ఇస్తే వారిపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం తగు చర్యలు, లైసెన్స్ క్యాన్సిల్ చేయబడును.

ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులుమహమ్మద్ ఖాద్రి డీలర్లను హెచ్చరించడమైనది, రైతులు ఏ ఎరువులు అడిగితే అవే మాత్రమే ఇవ్వవలెను..

ఎక్కడైనా ప్రత్తి పంటకు వాడు కనిపిస్తే పొటాషియం నైట్రేట్ 5 గ్రాముల లీటర్ నీటికి పిచికారి చేయాలి..

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివశంకర్, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కేటీ వెంకటేష్, గ్రామ అధ్యక్షుడు రంగన్న తదితర నాయకులు పాల్గొన్నారు

# తన రాజకీయ జీవితమంతా ఇక టిడిపిలోనే..
## వైసీపీలో చేరతానన్న ప్రచారం అసత్యం..

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి..

## తన పైన ఉన్న సస్పెన్షన్ త్వరలోనే ఎత్తివేస్తారు.

## సత్యవేడు నియోజకవర్గానికి రానున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు.

సత్యవేడు ,(కింగ్ )



తన రాజకీయ జీవితమంతా ఇక తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు. వైసీపీలో చేరే ప్రసక్తే లేదని, టీడీపీని వీడే ఆలోచనే లేదని తెలిపారు. కొద్దిరోజులుగా తెలుగుదేశం పార్టీలో ప్రాధాన్యత లేని ఆదిమూలం వేరే పార్టీలోకి చేరతారన్న ప్రచారం విస్తృతంగా జరుగుతుంది. ఈ అసత్య ప్రచారాన్ని ఖండ ఒక ప్రకటన విడుదల చేశారు.తాను ఎప్పుడూ టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయలేదని, గతంలో గానీ, ప్రస్తుతం గానీ వారి మీద ఎలాంటి అక్రమ కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు.పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ లపై తనకు అపారమైన విశ్వాసం ఉందని చెప్పారు. ప్రస్తుతం తనపై ఉన్న సస్పెన్షన్‌ను కూడా పార్టీ అధిష్టానం త్వరలో ఎత్తివేస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. జూలై నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సత్యవేడు నియోజకవర్గంలో పరిధిస్తారని తెలిపారు.తనకు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చినా, ఇవ్వకపోయినా టీడీపీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "నన్ను నమ్మి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన చంద్రబాబు, లోకేష్ లకు ఎప్పటికీ ద్రోహం చేయను. నేను ఇప్పటికీ టీడీపీ ఎమ్మెల్యేనని గర్వంగా చెబుతున్నాను" అని ఆదిమూలం పేర్కొన్నారు. తనపై భూ ఆక్రమణలు, అవినీతి ఆరోపణలు ఎవరూ చేయలేదని, ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులు కూడా నమోదు కాలేదని తెలిపారు.గ్రావెల్, ఇసుక అక్రమ దోపిడీ లేదా అక్రమ రవాణాను తాను ఎప్పుడూ సమర్థించలేదని, అలాంటి కార్యకలాపాలకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదని స్పష్టం చేశారు. చట్ట విరుద్ధమైన చర్యలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు తాను ఎల్లప్పుడూ మద్దతు ఇస్తానని తెలిపారు.ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, కార్యకర్తల శ్రేయస్సే తన లక్ష్యమని, సత్యవేడు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.టీడీపీతోనే నా రాజకీయ ప్రస్థానం... టీడీపీతోనే నా చివరి శ్వాస వరకు ప్రయాణం అని తెలియజేశారు.

# బీసీల విద్యకు 'కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్ను దన్ను

## కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు

## ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం

## ఇటీవలే 6 ఎంజేపీలను కళాశాలలుగా అప్ గ్రేడ్

బడి బయట బీసీ బిడ్డలు ఉండకూడదనేదే సీఎం చంద్రబాబు నాయుడు

నూతన గురుకులాల ఏర్పాటుపై డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి హర్షం

బీసీ విద్యకు ప్రాధాన్యమిస్తున్నందుకు సీఎం చంద్రబాబు నాయుడు కు డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ధన్యవాదాలు

తిరుపతి ,(కింగ్ )

విద్యతోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బావన అని ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బీసీ విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని టిడిపి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి , టిటిడి బోర్డు సభ్యులు, తిరుపతి తు డా చైర్మెన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. బడి బయట ఏ బీసీ బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు నాయుడు ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బీసీ హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టారని డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు



ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్

ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస(విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి(నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఒనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతలు సైతం ప్రారంభమయ్యాయి అని డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు

కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకళు (అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ,కదిరి(శ్రీసత్యసాయి) లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ గురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరో అయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుందని టిడిపి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి, టిటిడి బోర్డు సభ్యులు, తిరుపతి తుడా చైర్మెన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు

సీఎం చంద్రబాబు నాయుడు డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ధన్యవాదాలు

బడి బయట ఏ ఒక్క బీసీ బిడ్డా ఉండకూడదనే సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని తిరుపతి తు డా చైర్మెన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి కొనియాడారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై తిరుపతి తు డా చైర్మెన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బీసీ బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందని డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బీసీల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, యువ కిశోరం టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యా మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ కు ప్రముఖ వ్యాపార దిగ్గజం డాలర్స్ గ్రూప్స్ అధినేత, టిడిపి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి, టిటిడి బోర్డు సభ్యులు, తిరుపతి తుడా చైర్మెన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

# మహిళల భద్రతపై అవగాహన..

బి.కొత్తకోట ,(కింగ్ )



ఎస్పీ శ్రీ దిరాజ్ కునుబిల్లి ఐపీఎస్ సర్ అదేశాలమేరకు బి.కొత్తకోట పట్టణంలోని స్థానిక సుంకు కళాశాల యందు మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులకు ముఖ్యంగా రహదారి భద్రత, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మహిళల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలపై పోలీసు అధికారులు సమగ్రంగా వివరించారు. సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని హాజరైన వారికి తెలియజేశారు. అదేవిధంగా, మహిళలు ఎలాంటి ఆపద పరిస్థితులు ఎదురైనప్పటికీ భయపడకుండా వెంటనే స్పందించి సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాల్సిన విధానం గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన టోల్‌ఫ్రీ నంబర్లు, పోలీసు సహాయ సేవల వివరాలను కూడా సమావేశంలో తెలియజేశారు. మహిళల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారా అనేక నేరాలను ముందుగానే నివారించవచ్చని అధికారులు సూచించారు. శక్తి యాప్ ఉపయోగించే పద్ధతి పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బి.కొత్తకోట సీఐ గోపాల్ రెడ్డి సర్ శక్తి టీం మదనపల్లి మునికుమార్ నాయిక్, వీణ కుమారి కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్. పాఠశాల సిబ్బంది. మరియు పోలీస్ సిబ్బంది విద్యార్థులు తదితరులు

# కాపు సామాజికవర్గంపై వైసీపీ నకిలీ ప్రేమ ...

## టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని తిరుమల కుమార్.



కాకినాడ ,(కింగ్ )

రాష్ట్రంలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తన రాజకీయ ఉనికి కోసం మళ్లీ కులాల మధ్య చిచ్చు పెట్టే నీచబుద్ధిని ప్రదర్శిస్తోంది తెలుగుదేశం – జనసేన – బీజేపీ కూటమి బంధాన్ని, ముఖ్యంగా కాపు సామాజికవర్గంతో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తప్పుబడుతూ వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు వారి అజ్ఞానానికి, అసూయకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని చూసి తట్టుకోలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ చౌకబారు ఆరోపణలు చేస్తున్నారు.

వైసీపీకి మరియు ఆ పార్టీ నేతలకు పావని సూటి ప్రశ్న మేము కాపు రిజర్వేషన్లపై జగన్ రెడ్డి మోసం గుర్తులేదా? 2019 ఎన్నికల సమయంలో జగ్గంపేట వేదికగా "కాపులకు రిజర్వేషన్లు ఇవ్వడం నా చేతుల్లో లేదు, నేను సాధ్యం కాని హామీలు ఇవ్వను"అని కాపు జాతిని నట్టేట ముంచిన వ్యక్తి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాదా ఆనాడు జగన్ రెడ్డి కాపుల ప్రయోజనాలను కాలరాస్తుంటే, ఈరోజు ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడుతున్న వైసీపీ కాపు నేతలు ఏ పాతాళంలో దాక్కున్నారు సంక్షేమ పథకాలను నిలిపివేసిన ద్రోహి జగన్ రెడ్డి,గత కూటమి ప్రభుత్వం కాపు యువత భవిష్యత్తు కోసం ప్రవేశపెట్టిన "విదేశీ విద్యా దీవెన, స్వయం ఉపాధి రుణాలు, ఈబీసీ రిజర్వేషన్లు, సివిల్స్ కోచింగ్"వంటి అద్భుతమైన పథకాలను ఐదేళ్ల పాలనలో తుడిచిపెట్టేసింది వైసీపీ"ప్రభుత్వం కాదా కాపు కార్పొరేషన్‌కు నిధులు లేకుండా చేసి, కేవలం కాగితాలకే పరిమితం చేసిన చరిత్ర జగన్ రెడ్డిది కాదా? పవన్ కళ్యాణ్ గారిపై అవాకులు చవాకులు పేలితే కాపు సమాజం ఊరుకోదు! జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు పదవుల కోసం కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజా భవిష్యత్తు కోసం రాజకీయాలు చేసే నిఖార్సైన నాయకుడు వైసీపీ నేతలు తమ రాజకీయ లబ్ధి కోసం కాపు జాతిని అడ్డుపెట్టుకుని మాట్లాడుతున్నారు కూటమి ప్రభుత్వంలోనే కాపులకు నిజమైన గౌరవం – ప్రగతి, కాపు యువతకు ఉపాధి, విద్యా అవకాశాలను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోంది అధికారంలో ఉన్నప్పుడు కాపులను ఓటు బ్యాంకుగా వాడుకుని, అభివృద్ధిని అణచివేసిన వైసీపీ నేతలకు కాపు సమాజం ఇప్పటికే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పింది. అయినా బుద్ధి మార్చుకోకుండా సమాజంలో కుల విద్వేషాలు రగల్చాలని చూస్తే, భవిష్యత్తులో వైసీపీ అనే పార్టీకి రాష్ట్రంలో అడ్రస్ లేకుండా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పావని హెచ్చరించారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో కూడిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణంగా విశ్వసిస్తున్నారు.

## హత్యకు గురికాబడిన రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ సోమయాజులును తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్

విశాఖపట్నం,(కింగ్ )

హత్యకు గురైన రాధా గాయత్రి కుటుంబం ముస్సూరీ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ని కలిసి హత్యకు గురికాబడిన రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ సోమయాజులును తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.సబ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్– అధికారిక విచారణకు హామీ ఇవ్వడం జరిగింది.విశాఖపట్నానికి చెందిన స్వర్గీయ రాధా గాయత్రి తండ్రి, మాజీ సైనికుడు పి. సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఈరోజు ముస్సూరీ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ / జాయింట్ మేజిస్ట్రేట్ రాహుల్ ఆనంద్, ఐఏఎస్ ని కలిశారు.ఈ సందర్భంగా సుధాకర్ తన కుమార్తె మరణానికి సంబంధించిన సంఘటనల క్రమాన్ని, వివాహ జీవితం లో ఎదురైన ఇబ్బందులను, మరియు ఈ మరణం అనుమానాస్పద పరిస్థితుల్లో జరిగిందనే విషయాన్ని వివరంగా తెలియజేశారు. రాహుల్ ఆనంద్, ఐఏఎస్ కుటుంబ సభ్యుల వేదనను శ్రద్ధగా విని, ఈ దుర్ఘటనపై తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కేసు గంభీరతను గుర్తించి సమగ్ర విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే, ముస్సూరీ జిల్లా కలెక్టర్ ఆశిష్ చౌహాన్, ఐఏఎస్ ని కూడా కలవాలని కుటుంబానికి సూచించారు మరియు అధికారిక విచారణ ప్రారంభం కోసం తాను సూచిస్తానని తెలిపారు.ముఖ్యంగా, మృతురాలి తల్లి శ్రీమతి సత్యవతి వాంగ్మూలాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా త్వరలోనే నమోదు చేస్తామని, అది రేపటిలోపు జరిగే అవకాశం ఉందని తెలిపారు.అనుమానాస్పద పరిస్థితుల్లో నూతన వధువు మరణం,పారుపూడి రాధా గాయత్రి గురుగ్రామ్‌లో పనిచేస్తూ, పూణేకు చెందిన డెలాయిట్ కంపెనీ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ శ్రీచరణ్ సోమయాజులును 8 నవంబర్ 2025న వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన ఎనిమిది నెలల్లోపే, 15 జూన్ 2026న ముస్సూరీ ▪ ధనౌల్టి రోడ్‌లోని ఒక హోమ్‌స్టేలో ఆమె మృతదేహం అనుమానాస్పద పరిస్థితుల్లో కనుగొనబడింది.భర్త ఇచ్చిన వివరణను కుటుంబ సభ్యులు ఖండిస్తూ, ఈ ఘటనలో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వేధింపులు, నిఘా ఆరోపణలు వివాహ జీవితంలో రాధా గాయత్రి పై నిరంతర వేధింపులు మరియు పర్యవేక్షణ జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె బ్యాగులో ట్రాకింగ్ పరికరం కనుగొనడం, ఆమె కదలికలపై నిఘా పెట్టడం వంటి సంఘటనలను వారు ప్రస్తావించారు.కేసు నమోదు; నిందితుడు అదృశ్యం,కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు ఉత్తరాఖండ్ పోలీసులు సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు. కొత్త విచారణాధికారిని కూడా నియమించారు.అయితే, నిందితుడైన భర్త శ్రీచరణ్ సోమయాజులు ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో లేరని, అతను పరారీలో ఉన్నాడని కుటుంబం ఆందోళన వ్యక్తం చేసింది.ప్రభుత్వానికి విజ్ఞప్తి,రాధా గాయత్రి కుటుంబ సభ్యులు ముస్సూరీ జిల్లా కలెక్టర్, ఉత్తరాఖండ్ పోలీసు శాఖ మరియు సంబంధిత అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకుని, ఈ కేసును సమగ్రంగా, వేగంగా విచారించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



Rahul Anand , IAS , Joint Magistrate/ Sub Divisional Magistrate, Mussorie 21:04

## కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన గౌరవ రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, స్వర్ణ గ్రామ,వార్డు మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి

కాకినాడ ,(కింగ్ )

కాకినాడ రోడ్డు భవనాల అతిథి గృహం వద్ద గౌరవ రాష్ట్ర మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి సాదర స్వాగతం పలికిన .. రాష్ట్ర హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఎవీఎస్. సూర్యనారాయణ రాజు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు అధికారి జె. వేణుగోపాల్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.ఎస్.శోభా రాణి, పోలవరం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సత్యనారాయణ మూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జీ. గౌరీ శంకర్, గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త జి. రాజకుమారి, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర రాష్ట్ర మంత్రి వెంట ఉన్న అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు, ఇతర అధికారులు

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం,(కింగ్ )



మన దక్షిణ నియోజకవర్గం మాటా మంతి (ప్రజా సమస్యల పరిష్కారం)" కార్యక్రమం నిర్వహణ దక్షిణ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, సంబంధిత అధికారుల సమక్షంలో వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో "మన దక్షిణ నియోజకవర్గం ▪ మాటా మంతి (ప్రజా సమస్యల పరిష్కారం)" కార్యక్రమం జగదాంబ సూర్యబాగ్‌లోని సౌత్ జోనల్ కార్యాలయంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో అన్ని శాఖల అధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఈ "మాటా మంతి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి వారానికి ఒకసారి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అన్ని శాఖల అధికారులు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో ప్రజలు ఒకే సమస్య కోసం వివిధ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం ఉండదని, సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ వివరించారు.ఇప్పటికే దక్షిణ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో దిలీప్ చక్రవర్తి, ఎంఆర్వో లచ్చ పాత్రుడు, ఈస్ట్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి, ఏఎస్ఓ శ్రీహరి, జీవీఎంసీ, విద్యుత్, పారిశుధ్య శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు.

# విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో అసువులు బాసిన కార్మిక సోదరులకు నివాళులు



విశాఖ,(కింగ్ )

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో అసువులు బాసిన కార్మిక సోదరులకు సంఘీభావంగా, ఈరోజు కూర్మన్నపాలెం జంక్షన్‌లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి అలాగే క్యాండిల్ వెలిగించి నివాళులు అర్పించారు ఈ యొక్క కార్యక్రమానికి రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎస్సి సెల్ జనరల్ సెక్రెటరీ మార్డుపూడి పరదేశి వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ గాజువాక నియోజవర్గం అధ్యక్షులు పిట్టా రెడ్డి వైస్సార్ టి యూ సి నాయకులకు గేదెల మధుసూదన్ రెడ్డి వైస్సార్సీపీ విశాఖ జిల్లా సోషల్ మీడియా జనరల్ సెక్రెటరీ ధర్మపురి చక్రవర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు

## రాజవరం గ్రామంలో శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర వీరేశ్వర స్వామి వారి దేవస్థానం

### నూతన శిఖర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న యువనాయకులు బండారు సంజీవ్



ఆత్రేయపురం,(కింగ్ )

ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామంలో శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర వీరేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన శిఖర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న యువనాయకులు బండారు సంజీవ్ గారు మరియు వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట రాజు (గబ్బరసింగ్ ), ముళ్ళపూడి భాస్కరరావు,తోట రజిని, మరియు గ్రామ ముఖ్య నాయుకులు కార్యకర్తలు హాజరయ్యారు

# ముమ్మరంగా వాహనాలు తనిఖీ

కొయ్యూరు ,(కింగ్ )



అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం లో చీడిపాలెం జంక్షన్ వద్ద మంప ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్ మరియు తదితర సర్టిఫికెట్లు క్షుణ్ణంగా పరిశీలించారు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలి అని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మన ఊరిని పరిశుభ్రంగా ఉంచుకుందాం

కొయ్యూరు ,(కింగ్ )

అల్లూరి సీతారామరాజు జిల్లా నల్లగొండ గ్రామపంచాయతీ వై ఎన్ పాకలు గ్రామంలో స్వచ్ఛ రథం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.





ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై కోప్పుకొండ నుండి వై ఎన్ పాకలు గ్రామం వరకు రోడ్డు ఇరువైపులా శుభ్రపరిచారు మరియు వై ఎన్ గ్రామం అంతా శ్రమదానం చేసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో కె టి నాయుడు చేతుల మీదుగా వై ఎన్ పాకలు గ్రామానికి స్వచ్ఛ రథం రిక్షాను అందించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సెగ్గే శ్రీను,, మాదల రమణ,పల్లిఅప్పారావు, లోతా సింహాచలం, వి ఆర్వో లు దేవుడు రాజు, గంగరాజు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి ఫుట్ ఓవర్ బ్రిడ్జి: గంటా

విశాఖపట్నం,(కింగ్ )



చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. బ్రిడ్జి పనుల పురోగతిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అధికారులు పనుల ప్రగతిని వివరించారు. రూ.3.29 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల చంద్రంపాలెం హైస్కూల్ కు వెళ్లే విద్యార్థులతో పాటు జాతీయ రహదారి మధ్య రాకపోకలు సాగించే వేలాది మందికి ప్రజలకు సౌకర్యం చేకూరుతుందని గంటా పేర్కొన్నారు. కార్యక్రమంలో మధురవాడ జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, నాగోతి సత్యనారాయణ, మాన్యాల సోంబాబు, నాగోతి సూర్యప్రకాష్, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి గోపీ, బోయి రమాదేవి, పోతిన ప్రసాద్, తమ్మిన సూరిబాబు, ఎస్.ఎం.సి. చైర్మన్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ లో అనర్హులను గుర్తించండి: గంటా ఆదేశం

విశాఖపట్నం,,(కింగ్ )



నియోజకవర్గంలో హౌసింగ్ లో అనర్హులను గుర్తించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సైబర్ వ్యాలీ, బక్కన్నపాలెం, ఓజోన్ వ్యాలీ, హుద్ హుద్ తదితర ఇళ్లల్లో లబ్ధిదారులు కాకుండా అనర్హులు ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొందరు వ్యక్తులు సిండికేట్ గా మారి ఒకొక్కరి చేతుల్లో 4 నుంచి 5 ఇళ్లు ఉంచుకోవడం వల్ల ప్రభుత్వ ఆశయం దెబ్బతింటోందని పేర్కొన్నారు. వారం రోజుల సమయంలో తనిఖీ నివేదిక అందజేయాలని, అనంతరం ఆయా ఇళ్లను సందర్శిస్తానని వెల్లడించారు. త్వరితగతిన తనిఖీలు పూర్తి చేయడానికి హౌసింగ్ అధికారులకు సహకరించాలని మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడిని ఆదేశించారు. తంగుడుబిల్లి, గిడిజాలలో పెద్ద సంఖ్యలో నిర్మించిన ఒక సెంటు ఇళ్లలో మౌలిక సౌకర్యాలు లేని కారణంగా ఎవరూ ఉండే పరిస్థితి లేదన్నారు. భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, హౌసింగ్ పీడీ సూరిబాబు, డీఈ రామకృష్ణ, ఏఈలు సూర్యప్రకాష్, శ్యాంసుందర్, శేషుబాబు, ఉదయ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

# 1/70 చట్టంపై ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీల మౌనం దేనికి సంకేతం?

## భారత్ఆదివాసీపార్టీ.



కొయ్యూరు ,(కింగ్ )

1/70 భూబదాలయింపు నిషేధ చట్టంపై తాజా ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రుల మౌనం దేనికి సంకేతమని భారత్ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ప్రశ్నించారు. 1/70 చట్టం సవరణ చేయాలని 1700 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఆదివాసీ ప్రజల చేత,ఆదివాసీ ప్రజల కొరకు ఎన్నుకోబడిన అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం తప్పా,అరకు ఎంపీ గుమ్మ తనుజరాణితో సహా మిగతా ఎమ్మెల్యేలకుగానీ,ఎమ్మెల్సీకి గానీ, మాజీ మంత్రులకు గానీ,మాజీ ఎమ్మెల్యేలకు గానీ, జెడ్పీ తాజా,మాజీ చైర్ పర్సన్ లకు గానీ,ఎస్టీ కమీషన్ కు గానీ,అధికార కూటమి ప్రభుత్వంలో ఉన్న నామినేట్ పోస్టులలో ఉన్న వారికిగానీ, ఆదివాసీ మేధావులకు గానీ పట్టదా, ఇదేమైనా చిన్న విషయం లాగా ఉందా,గతంలో సుప్రీంకోర్టు జిఓ నెంబర్ 3 ని రద్దు చేసింది. జిఓ నెంబర్ 3 పోవడంతో ఎంత నష్టం జరిగిందో అందరికి తెలిసిందే కదా, ఇప్పుడు 1/70 భూబదాలయింపు నిషేధ చట్టం సవరణ మీద దాడి జరుగుతుంటే నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహారించడం ఎంత దుర్మార్గం.మీరు ఆదివాసీ ప్రజాప్రతినిధులు అన్న విషయం గుర్తు పెట్టుకొండి.అధికారం ఉంటేనే రాజకీయం కాదు, అధికారం ఉన్న లేకున్నా, ప్రజల పక్షం నిలబడటమే నిజమైనా రాజకీయం.ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతం నుండి పెద్దగా ఉండి ఆదివాసీల సమస్యలకు పరిష్కారం చూడవలసిన అరకు ఎంపీ గుమ్మ తనుజరాణి ఇప్పటి వరకు 1/70 చట్టం పై మాట్లాడలేదు. 1/70 చట్టం, బాక్సైట్ లపై మాట్లాడ వద్దని ఎవరైనా సలహా ఇచ్చారా,గతంలో కొత్తపల్లి గీత ఎంపీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అరకు పార్లమెంట్ ప్రాంతం నుండి కొంతమంది ఆదివాసీ మేధావులను ఢిల్లీ తీసికెళ్ళి కేంద్ర మంత్రుల ముందర బాక్సైట్ కు వ్యతిరేకంగా మాట్లాడించిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత అరకు ఎంపీ ఈ విషయంలో ముందు ఉండి 1/70 చట్టం, బాక్సైట్ మైనింగ్ వంటి వాటికీ వ్యతిరేకంగా రాష్ట్రపతి, ప్రధానమంత్రులతో మాట్లాడాలి.మేధావులను, అఖిలపక్షం నాయకులను ఢిల్లీ తీసికెళ్ళి కేంద్ర పెద్దలతో చర్చలు జరిపించవలసిన బాధ్యత తీసుకోవాలి. ఎమ్మెల్యేలు,మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు, అధికార కూటమిలో చైర్మన్లుగా, డైరెక్టర్లుగా, మిగతా పదవులలో ఉన్నవారు, గతంలో పదవులలో ఉన్నవారు, తాజాలు, మాజీలు అందరు కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సలహా మండలిలో తీర్మానం చేయించడం, పీసా తీర్మానాలు చేపించడం,1/70 చట్టం పై సుప్రీంకోర్టులో ఉన్న కేసులో ఇంప్లీడ్ అవ్వడం, ఇంప్లీడ్ అవ్వడానికి ఆర్థిక సహాయం చేయడం చేయాలి, అంతే కాని రోమ్ నగరం తగలబడిపోతుందంటే నీరో చక్రవర్తి పిడేలు వాయించేటట్లు ఉండొద్దని, గొంతులేని ఆదివాసీల పక్షాన గొంతుకలౌవుదామని, వారిని మోసం చేసే మోసగాళ్ళుగా కాకూడదని హితవు పలికారు.

# సూరపనేని విజయ్ కుమార్ కు స్వర సాగర్ నివాళి

విశాఖపట్నం,(కింగ్ )



స్వర సాగర్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరిలో విశాఖ అభినవ శ్రీకృష్ణదేవరాయలుగా పేరొందిన స్వర్గీయ సూరపనేని విజయ్ కుమార్ కి ఘన నివాళులర్పించారు. స్వర సాగర్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సన్ మూర్తి, సింగ్ ఈ సందర్భంగా మౌనం సభాముఖంగా పాటించి వారి సేవలను కొనియాడారు. అనంతరం వివిధ సినీ గీతాలతో వారికి స్వర నివాళులర్పించారు. సంస్థ వ్యవస్థాపకురాలు రత్నా సింగ్ వ్యాఖ్యానంతో సాగిన ఈ సంగీత విభావరిలో గాయకులు సింగ్, ఎమ్మెస్ మాధవ్, అరుణ కుమార్, ప్రసాద్ గాయనీమణులు ప్రియా, భారతి, జ్యోతి, లక్ష్మి తదితరులు అనేక గీతాలతో అలరించారు. తెలుగు హిందీ చలనచిత్ర గీతాలతో కార్యక్రమం జరిగింది. సంతాప కార్యక్రమంలో రాయప్ప, మహమ్మద్ ఖాన్, ఈమండీ ఈశ్వరరావు, మంజుల అరుణకాంత తదితరులు పాల్గొన్నారు

# ఆలమూరు జాబ్ మేళా లో... 80 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు!

## ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలిపిన కొత్తపేట టీడీపీ యువనాయకులు బండారు సంజీవ్

ఆలమూరు ,(కింగ్ )



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ూూూూణజ) ఆధ్వర్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు కొత్తూరు సెంటర్‌లోని గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'మెగా జాబ్ మేళా – 2026' కు కొత్తపేట టీడీపీ యువనాయకులు శ్రీ బండారు సంజీవ్ గారు హాజరయ్యారు. ూూూ జుశ్రీవష్తీశీఅఱఎం, ఖీూశజూచీచీ, ుఎూ,ాూజూశీశ్రీశ్రీశీూష్టుతీఝుఎఎ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈ మేళాలో తమ అద్భుత ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన 80 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. యువతకు ఇలాంటి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారానే వారి కుటుంబాల్లో నిజమైన వెలుగులు నింపగలమని పేర్కొన్న ఆయన, రాబోయే రోజుల్లో కూడా మన ప్రాంత యువత నైపుణ్యాభివృద్ధికి మరియు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని.. యువతకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బాడీ బిల్డింగ్ లో మొదటి స్థానం గెలుచుకున్న పలాసీ శ్రీరాముని అబినదించిన

## తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్ట గుళ్ళ సుబ్బారావు.








పాడేరు,(కింగ్ )

ాఖదీదీఖ'ం బాడీ కేర్ జిమ్ పాడేరు అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి నేషనల్ బాడీ బిల్డింగ్ క్లాసిక్ ఫిజిక్ షవఅస్త్రష్ట్ 55 కేటగిరిలో పెదబయలు మండలం రోడకోట గ్రామం పలాసి శ్రీరామునికల్ మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అల్లూరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ కొట్టగుల్లి సుబ్బారావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు జిమ్ ప్రోపరేటర్ మా విద్యార్థి బాడీ బిల్డింగ్ మొదటి స్థానం తెచ్చుకున్నందుకు చాలా సంతోషం అని తెలియజేస్తూ ప్రతి ఒక్క యువతకు నిఖిల్ ఆదర్శంగా ఉండాలని గెలిచిన నిఖిల్ కి జిమ్ తరఫున సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ఫైర్ స్టేషన్ ఎస్ఐ , వర్తక సంఘం పెద్దలు వర్మ, జిమ్ కోచ్ ధనరాజ్ మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సివిల్ సప్లై కళాశీల ఆందోళన

## నెలనెలా బిల్లులు చెల్లించకపోవడంతో ఆకలి మంటలతో అలమటిస్తున్న కళాశీలు...

పెందుర్తి ,(కింగ్ )




పెందుర్తి సివిల్ సప్లై రేషన్ గోడౌన్ వద్ద నిరసన ధర్నా రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై రేషన్ గోడౌన్లలో పనిచేస్తున్న కళాశీలకు ప్రభుత్వం నెలనెలా సక్రమంగా బిల్లులు చెల్లించడం లేదని, దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సివిల్ సప్లై కళాశీలు యూనియన్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ) ఎం. మన్మధరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని సివిల్ సప్లై రేషన్ గోడౌన్ వద్ద కళాశీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ, కళాశీలకు ప్రతి నెలా రావాల్సిన కూలీ డబ్బులు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందన లేదన్నారు. కుటుంబాల పోషణ భారంగా మారి, కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి బిల్లులను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని, వారి జీవనోపాధికి భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకులు జి. వెంకట్రావు, కొల్లి సన్యాసిరావు, స్థానిక కళాశీలు దమ్ము రాజు, వి. నూకరాజు, ఎస్. ఈశ్వరరావు, బత్తిన శ్రీరాములు, ఆర్. అప్పలనాయుడు తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# రైతన్న మీకోసం కార్యక్రమం

చిత్తూరు బ్యూరో ,(కింగ్ )






పలమనేరు మండలం నందు టీ వడ్డూరు రైతు సేవ కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి మురళి జాయింట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ ఉమామహేశ్వరి జాయింట్ డైరెక్టర్ సిరికల్చర్ పద్మమ్మ డిడి ఫిషరీస్ ప్రమోద్ మల్లి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమం వ్యవసాయ అభివృద్ధి, సుస్థిర వ్యవసాయం మరియు రైతు సంక్షేమం కోసం ప్రతి రైతు సేవా కేంద్రాలలోనూ 22 జూన్ నుండి 28 జూన్ వరకు నిర్వహించాల్సి ఉంటుందని తెలియజేశారు.

ఈ సంవత్సరం ఎల్ఈనో ప్రభావంతో వర్షపాతం తక్కువ నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులందరూ బిందు మరియు తుంపర్ల సేద్యం పై ముగ్గు చూపాలని పంట మార్పిడి ఎంచుకొని ప్రస్తుత పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి ఉన్న పంటలను ఎంచుకొని వర్షాధార పంటలను సాగు చేసుకోవాలని కోరడమైనది.

వర్షాధారం క్రింద పంట మార్పిడి లో భాగంగా సోయాబీన్ సాగు ఈ ప్రాంతానికి అనువైనదని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ సెరికల్చర్ పద్మమ్మ మాట్లాడుతూ మల్బరీ సాగులో యాంత్రికరణ ద్వారా సాగు ఖర్చు తగ్గించవచ్చని రైతులకు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వరి పిఎండిఎస్ కిట్స్ పశుగ్రాశం గా వాడడం వల్ల పశువులకి నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాలలో కొవ్వు శాతం ఎస్ఎంఎఫ్ పెరుగుతుందని తెలియజేశారు.

అధికారులు ప్రజా నాయకులతో కలిసి రైతులకు సోయాబీన్స్ మరియు కందుల విత్తనాలను పంపిణీ చేశారు. చివరగా ప్రకృతి వ్యవసాయ విభాగం వారు పిఎండిఎస్ కిట్లు కింద ఉన్న విత్తనాలను పేలటైజేషన్ ఏ విధంగా చేయాలో రైతులకు చేసి చూపించారు

ఈ కార్యక్రమంలో డిడి ఫిషరీస్ ప్రమోద్మల్లి గారు, మండల వ్యవసాయ అధికారి సంధ్య మండల సెరికల్చర్ ఆఫీసర్ ఫిరోజ్ ఫిషరీస్ ఇన్స్పెక్టర్ పయని, ప్రజా నాయకులు నాగరాజు రెడ్డి ,జగదీష్ నాయుడు, సహకార సంఘం అధ్యక్షులు వెంకట్ ముని రెడ్డి, స్వతంత్ర బాబు, గిరి శ్రీనివాసులు రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# "మెగా జాబు మేళ విజయవంతం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరు,(కింగ్ )






": తేదీ: 24.6.2026 బుధవారము స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మరియు జెకెసి వారి ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబు మేళాను, శ్రీ గౌరవ జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఐఏఎస్ వారు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జెసి గారు మాట్లాడుతూ... యువత శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుండాలని, టెక్నాలజీకి అనుకూలంగా వివిధ నైపుణ్యాలను అలవర్చుకోవాలని, పోటీ పరీక్షలలో ప్రతిభ చాటాలని, మరియు ఉద్యోగము ఎంత దూరంలో వచ్చిన, తప్పనిసరిగా జాయిన్ అవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి మాట్లాడుతూ.... యువతి యువకులు కమ్యూనికేషన్ స్కిల్స్ ను అభివృద్ధి చేసుకోవాలని, తరచూ వివిధ రకాల ఇంటర్వ్యూలకు హాజరు అవ్వాలని సూచించారు. ఇందులో సుమారు 13 కంపెనీలు హెచ్ ఆర్ లు పాల్గొన్నారు. జాబు మేళాకు హాజరైన విద్యార్థినీ విద్యార్థులు: 138 మంది, వివిధ కంపెనీలలో సెలెక్ట్ అయిన విద్యార్థిని విద్యార్థులు 58 మంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మనోరమ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి ప్రశాంత్ కుమార్, నవీన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్ రసూల్ కళాశాల సిబ్బంది ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి గౌరీ శంకర్రావు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలతో సమావేశం..

## భోజనాలు ఏర్పాటు చేసిన పల్లా కృష్ణ

సబ్బవరం,(కింగ్ )



అనకాపల్లి జిల్లా వైఎస్సార్సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పల్లా కృష్ణ ఆధ్వర్యంలో సబ్బవరం పంచాయతీ చిన్న గొల్లపాలెం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకం కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని, వాటి ద్వారా ప్రజలు నేరుగా లబ్ధి పొందారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామంలో పల్లా కృష్ణ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం పల్లా కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో అదీప్ రాజ్ పాల్గొని ఉపాధి హామీ కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటన రాము, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, సబ్బవరం మాజీ సర్పంచ్ దెద్దం ప్రసాద్, బొకం రామనాయుడు, దన్నిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ రాము, పల్లా అప్పలనాయుడు, సింగంపల్లి రామకృష్ణ, కదుపుకోట్ల గోపి, పల్లా ముత్యాలయ్య, పల్లా రమణ, గొంప నాయుడు, కనకరాజు, దేముడు బాబు, పల్లా అప్పలరాజు, దుర్గారావు, పల్లా భూలోకరావు, సారిపల్లి నాగరాజు, గొంప నూకరాజు, సారిపల్లి శ్రీను, ఊరువీటి గోవింద్, సంతోష్, సింగంపల్లి ముత్యాలయ్య, లోకేశ్, ఉప్పిలి ఎర్రినాయుడు, పల్లా విష్ణు, పెద్ద పైడిరాజు, వంశీ, మొల్లి కృష్ణ, బోనీ హరీష్, పవన్, రవి, కదుపుకోట్ల వంశీ, పిల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

# జి.మాడుగుల సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



జి.మాడుగుల, ,(కింగ్ )

జి.మాడుగుల సచివాలయ కేంద్రంలో కొత్తగా ఆధార్ వినియోగదారుల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సచివాలయ సెక్రెటరీ డి. విజయరాజు తెలిపారు.బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ, మండల పరిధిలోని ఆధార్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మొత్తం మూడు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే జి.మాడుగుల సచివాలయం పరిధిలో ఒక కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ కేంద్రంలో ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణలు, కొత్త మార్పులు, చేర్పులతో పాటు ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ చేయడం వంటి సేవలు అందిస్తామన్నారు. మండల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్ సమస్యలు ఉన్నవారు అవసరమైన ధ్రువపత్రాలతో సచివాలయ కేంద్రానికి రావాలని సెక్రెటరీ విజయరాజు కోరారు.

# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

## దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

### రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



అమరావతి,(కింగ్ )
సాయిబాబా ఆలయాల విషయంలో నేను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా మాకు లేదు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5,000 భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం మరియు గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు మరియు పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోంది. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదు. నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు మరియు పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే. సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని మరోసారి స్పష్టం చేస్తున్నాను. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు మరియు పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం మా ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం. సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని మేము గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని కోరుతున్నాను.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాద ఘటనపై అనకాపల్లి ఎంపీ దిగ్భ్రాంతి

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి..

సహాయక చర్యలు వేగవంతం చేయాలి

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి..

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించిన

## రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సిఎం రమేష్




అనకాపల్లి జిల్లా పరవాడ,(కింగ్ )
అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ్ ఎనర్జీ సంస్థలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారుల ద్వారా తెలుసుకుని సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను కోరారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన సహాయ చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రగతి పాదయాత్ర ఎస్సీ మోర్చా అంబేద్కర్ కోనసీమ జిల్లా.....

అలమూరు,(కింగ్ )
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి జరుగుతున్న పనులను బిజెపిఎస్సీ మోర్చా నాయకులు ఫ్లై ఓవర్ యొక్క పనులను ప్రజలకు అసౌకర్యం కల్పించకుండా పనులను వేగవంతం చేసి త్వరగా ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరడమైనది... ది.బుధవారం భారతీయ జనతా పార్టీ ప్రధాని నరేంద్ర మోడీ గారు 12 సంవత్సరాల. నమ్మకం. అభివృద్ధి. ప్రజా సంక్షేమం. కార్యక్రమం భాగంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గారి ఆదేశాల మేరకు మరియు రాష్ట్ర ఎస్సీ మార్చఅధ్యక్షులు పనతల సురేష్



సారధ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ప్రగతి పాదయాత్ర కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జిల్లాలోని ప్రాజెక్టుల వాటి యొక్క నిర్మాణ దశ ప్రారంభం పనులు ప్రజలకు అందించాలని పార్టీ పిలుపు మేర ఈరోజు జొన్నాడఫ్లై ఓవర్ బ్రిడ్జి యొక్క పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కోరడమైనది ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్సీ మార్ఛ్ జిల్లా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు దీనికి ముఖ్య అతిధులుగా జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ గారు మరియు జాతీయ కౌన్సిల్ మెంబర్ మానేపల్లి అయోధ్య వేమ ఎక్స్ ఎమ్మెల్యే పాల్గొన్నారు ముఖ్య అతిథులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ గారి ప్రభుత్వంలో లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిదేశంలోని గొప్ప అభివృద్ధి జరుగుతుందని బ్రిడ్జిలు నేషనల్ హైవే రోడ్లు రైల్వే బ్రిడ్జిలు ఓడరేవులు ఎయిర్పోర్ట్లు నూతనంగా నిర్మించబడుతున్నాయని దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ప్రజలందరూ సౌఖ్యంగా ఉండాలనే భావనతో దేశంలో నమ్మకం అభివృద్ధి ప్రజా సంక్షేమ ధ్యేయముగా నరేంద్ర ప్రజలందరూ గమనించాలన్నారు ప్రజలకు సౌకర్యార్థంగా బ్రిడ్జి పనులు త్వర త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు కోరారు ఈ కార్యక్రమంలో ఓ బి సి మార్ఛ్ ఆయన్ని వెలి సత్తిబాబు గౌడ్ కొవ్వూరి సీతారాం రెడ్డి ఎం.వి కృష్ణా రెడ్డి చిట్టి నీటి రంగసాయి పోతంశెట్టి రాజు టేకుమూడి సూరిబాబు బొర్రా ఆంజనేయులు వీర్నాల రమణ బాబు మరియు అధికారులు తేజ సురేష్ గారు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో నిష్పక్షపాతంగా సర్ ప్రక్రియ

## - పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇంటింటి సర్వే

## - బీఎల్‌వోల ద్వారా 10,68,500 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

## - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఎన్‌టీఆర్ జిల్లా, ,(కింగ్ )
ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను నిష్పక్షపాతంగా జరిగేలా చూస్తున్నామని.. ఇంటింటి సర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాలో సుశిక్షితులైన 1,792 మంది బీఎల్‌వోలు ఉన్నారని.. వీరిద్వారా ఇంటింటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 10,68,500 (62.36 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందన్నారు. తిరువూరులో 1,48,616 (71.21 శాతం), విజయవాడ పశ్చిమ 1,07,034 (41.65 శాతం), విజయవాడ సెంట్రల్ 1,30,164 (46.85 శాతం), విజయవాడ తూర్పు 1,18,639 (43.98 శాతం), మైలవరం 2,14,637 (75.27 శాతం), నందిగామ 1,73,051 (83.41 శాతం), జగ్గయ్యపేట 1,76,359 (84.97 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. అదేవిధంగా జిల్లా మొత్తంమీద 85,044 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనాలని.. ఎన్యూమరేషన్ ఫారాలను నింపి సంబంధిత బూత్‌స్థాయి అధికారులకు త్వరితగతిన అందజేసి, ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# వివిధ రెవెన్యూ అంశాలపై ప్రగతిని వేగవంతం చేయాలి:

## జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



అమలాపురం ,(కింగ్ )
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ రెవెన్యూ ప్రాధాన్యత అంశాలను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడు వులోగా పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రెవెన్యూ అధికారు లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్లు తో నిర్వ హించి 22 ఏ భూములు రీ సర్వే పిజిఆర్ఎస్ బల్క్ సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, రెవెన్యూ వన్, ఫార్మర్ రిజిస్టరీ, ఓ ఆర్ సి ఎం ఎస్ యాప్ వినియోగం వంటి పలు కీలక రెవెన్యూ అంశాల పురోగతిపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రెవిన్యూ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయా విభాగాల వారీగా నిర్దేశత లక్ష్యా లను చేరుకో వాలని ఆదేశించా రు బల్క్ సమస్యలు 22ఏ జాబితాలోని భూ సమ స్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. అర్హత కలిగిన క్లియరెన్స్ దరఖా స్తులను క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి, నిబం ధనల ప్రకారం నిషేధిత జాబితా నుండి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బల్క్ సమ స్యల పరిష్కారానికి మండలాల వారీగా నివేదికలు సిద్ధం కావాలన్నారు పి.జి.ఆర్.ఎస్. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను నా ణ్యతతో, సకాలంలో పరిష్క రించి. రీ-ఓపెన్ అయ్యే అర్జీల సంఖ్య తగ్గాలన్నారు. దరఖాస్తు దారుడు సంతృప్తి చెందేలా పారదర్శక పరిష్కారం చూపా లన్నారు. రీ-సర్వే ప్రక్రియ అత్యంత ప్రాధా న్యత సంతరించుకుందని. నిర్దేశించిన గ్రామాల్లో సర్వేను త్వరితగతిన పూర్తి చేసి, సరిహద్దు రాళ్ల నాటడం, మ్యుటేషన్ల ప్రక్రియ ను గ్రౌండ్ లెవెల్‌లో పూర్తి చేయాలన్నారు భవిష్యత్తులో ఎక్కడా వివాదాలకు తావు లేకుండా భూముల రికార్డులను ఆధునీకరించాలన్నారు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీరీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో మరియు కొత్తగా మ్యుటే షన్లు అయిన రైతులకు సంబంధించిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల ప్రింటింగ్ మరియు పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశిత టైమ్‌లైన్ ప్రకారం రైతులకు నేరుగా అందేలా చూడాలన్నారు. రెవెన్యూ వన్ డిజిటల్ రెవెన్యూ సేవలను మరింత బలోపేతం చేయ డంలో భాగమైన రెవెన్యూ వన్' పోర్టల్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్షించారు. సర్టిఫికెట్ల జారీ, భూ రికార్డుల సేవల్లో ఎటువంటి ఆలస్యం జరగకూడదన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ పీఎం కిసాన్ మరియు ఇతర సంక్షేమ పథకాలకు అనుసంధా నంగా జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయా లన్నారు ఈ-కేవైసీ పెండింగ్‌లను తక్షణమే క్లియర్ చేయాలని వ్యవ సాయ, రెవె న్యూ అధికారులను ఆదేశించా రు. ఓ.ఆర్.సి.ఎమ్.ఎస్. యాప్ ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు కేసుల మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌లో జిల్లాకు సంబంధించిన అన్ని కోర్టు కేసులు, వివాదాల వివరా లను ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేయాలన్నారు. కౌంటర్ అఫిడ విట్లు దాఖ లు చేయడంలో ఆలస్యం వహించరాదన్నారు. రెవెన్యూ సేవల్లో పారదర్శకత లోపించినా, నిర్లక్ష్యం వహించి నా సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. ప్రతి వారం ఈ ప్రగతిని పర్యవే క్షించడం జరుగుతుందన్నారు ఈ సమీక్షా సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నైదియాదేవి జిల్లా రెవె న్యూ అధికారి వి సుబ్బా రావు. ఆర్డిఓలు జి వి సత్యనారా యణ, ఏ సరళావతి, సర్వే ఏడి కే ప్రభాకర్ తదితరులు పాల్గొ న్నారు

# వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేయాలి .

రుద్రవరం.,(కింగ్ )




ఎల్ నినో నేపథ్యంలో ఏడాది వర్షాబావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని నరసాపురం ఆలమూరు గ్రామాలలో బుధవారం వ్యవసాయ అధికారులు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి సుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంద్యాల డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మద్దిలేటి, నంద్యాల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య, ఆళ్లగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతన్న మీకోసం అనే కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో రైతులను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. ఏడాది ఖరీఫ్ సీజన్ పెట్టుబడి కొరకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కేంద్ర ప్రభుత్వం బియ్యం కిసాన్ సమ్మాన్ నిధి పథకాల ద్వారా 7000 రూపాయలు ఆన్లైన్లో రైతులకు జమ చేయడం జరిగిందన్నారు. రుద్రవరం మండలానికి సంబంధించి 9601 మంది అన్నదాత సుఖీభవ కింద 4.8 కోట్ల రూపాయలు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 1.6 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతులు రసాయనిక ఎరువులు విరివిగా వాడడం తగ్గించుకోవాలని తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. నీటి వనరులను బట్టి దీర్ఘకాలిక పంటలు సాగు చేయకుండా స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు, వ్యవసాయ సహాయకులు జయకృష్ణ, శ్రావణి, ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది శంకర్ ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

# నంద్యాల లో వైద్య విద్యా సదస్సు

**నంద్యాల ఐఎంఏ, హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అపోలో ఆసుపత్రి సంయుక్త నిర్వహణ వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ అపోలో ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయనన్**

నంద్యాల ,(కింగ్ )







నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అపోలో ఆసుపత్రి సహకారంతో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి,వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయనన్ ముఖ్య వక్తలుగా పాల్గొని మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ప్రసంగిస్తూ వెన్నెముక శస్త్ర చికిత్సలో నూతన విధానాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయనన్ మాట్లాడుతూ కాలు రక్తనాళాలలో రక్త సరఫరా సమస్యలు వచ్చినప్పుడు అనుసరించాల్సిన శస్త్ర చికిత్స విధానాలను వివరించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు ప్రాక్టీస్ చేసినంత కాలం తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ ఉండాలని, తద్వారా నూతన వైద్య విధానాలు, పరికరాలపై అవగాహన కలిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు,రాష్ట్ర ఐఎంఏ మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్,అపోలో ఆసుపత్రి ప్రతినిధి రమణ, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు, పాల్గొన్నారు.

# డోన్ ఏరియా ఆసుపత్రిలో విద్యుత్ అంతరాయం రోగుల ఇబ్బందులు

డోన్,(కింగ్ )



డోన్ ఏరియా ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆసుపత్రి సేవలు కొంత మేరకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. విద్యుత్ లేకపోవడంతో సిబ్బంది ఓపీ (ఔట్ పేషెంట్) సేవలను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలుస్తోంది. దీంతో ఉదయం నుంచే ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు రోగులు ఓపీ చీటీలు, వైద్య సేవలు పొందడంలో తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు సమాచారం. విద్యుత్ అంతరాయం కారణంగా కంప్యూటర్ ఆధారిత సేవలు నిలిచిపోవడంతో రోగుల నమోదు ప్రక్రియ ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఆసుపత్రి అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తంగడంచ చెరువుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**క్షేత్రస్థాయిలో చెరువు పనులపై కలెక్టర్ సమీక్ష- నీటి నిల్వ పెంపుపై అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు**

**చెరువు అభివృద్ధిలో నిర్లక్ష్యానికి తావులేదు- ప్రజల అవసరాలకు అనుగుణంగా చెరువు అభివృద్ధి పనులు**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

నంద్యాల ,(కింగ్ )




జలధార – జలహారతి కార్యక్రమం కింద తంగడంచ చెరువులో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించే విధంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో తంగడంచ చెరువు పరిధిలో చేపడుతున్న ఫీడర్ ఛానల్, నీటి ప్రవాహ మార్గాల అభివృద్ధి, చెరువు కట్టల బలోపేతం, నిల్వ సామర్థ్య పెంపు పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, తంగడంచ చెరువు అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.హౌచెరువులోకి నీటి ప్రవాహాన్ని మెరుగుపరిచే ఫీడర్ ఛానల్ పనులు పూర్తిస్థాయిలో అమలైతే గతంలో కంటే అధికంగా నీటి నిల్వ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేవలం పనులు పూర్తి చేయడమే కాకుండా, వాటి ద్వారా చెరువు నిల్వ సామర్థ్యం ఎంత పెరుగుతుందో, భూగర్భ జలాల రీఛార్జ్ ఎంత మేరకు మెరుగుపడుతుందో స్పష్టమైన వివరాలతో అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. చెరువు పరిధి, ఫీడర్ ఛానళ్లు, సప్లై ఛానళ్లు, ఆక్రమణల వివరాలు, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం, అదనంగా సృష్టించగల నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై సమగ్ర స్కెచ్‌లు రూపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

హౌ

తంగడంచ చెరువును కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా గ్రామ ప్రజలు, రైతులకు ఉపయోగపడే ఆదర్శ జలవనరుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువు అభివృద్ధి ద్వారా సాగునీటి లభ్యత పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు మెరుగుపడేలా చర్యలు ఉండాలని తెలిపారు. డీఎంఎఫ్ నిధులతో చేపడుతున్న పనుల్లో ప్రతి రూపాయి ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. పనుల అమలులో జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యతలో ఎటువంటి రాజీ ఉండకూడదని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో అక్రమ తవ్వకాలు, ఆక్రమణలు, భూవినియోగ మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు భూముల పరిరక్షణకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా చెరువుల అభివృద్ధి, నీటి నిల్వ పెంపు, భూగర్భ జలాల రీఛార్జ్, గ్రామీణ జీవనోపాధి బలోపేతం లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జలవనరుల ఎస్ఈ శివశంకర్, డ్వామా పీడీ సూర్యనారాయణ, భూగర్భ జల శాఖ డీడీ రఘురామ్, ఇరిగేషన్ డీఈ, ఎఈలు పాల్గొన్నారు.

# మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**






నంద్యాల ,(కింగ్ )

ప్రజలకు, శిక్షణా కార్యక్రమాలకు హాజరయ్యే వారికి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్ఓవాటర్ ప్లాంట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలను కల్పించడం అభినందనీయమన్నారు. మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి ఆర్ఓ ప్లాంట్ కాంట్రాక్టర్ జగన్ రెడ్డి ఉచితంగా ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను అందించడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అలాగే సుమారు 2.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆర్ఓ ప్లాంట్ ద్వారా కేంద్రానికి వచ్చే అధికారులు, సిబ్బంది, శిక్షణార్థులు స్వచ్ఛమైన తాగునీటిని పొందగలరని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీటి పాత్ర ఎంతో కీలకమని, ఇటువంటి కార్యక్రమాలు ఇతరులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌హౌఎస్ఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్‌హౌఎస్ఈ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొని =ా ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.

# గుడిసె పైనుండి కింద పడిన వ్యక్తికి తీవ్ర గాయాలు



రుద్రవరం.,(కింగ్ )

మండల కేంద్రమైన రుద్రవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుడిసె పై నుండి కింద పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కోటకొండ చాకలి నరసింహుడు అనే వ్యక్తి గ్రామంలోని అటవీశాఖ కార్యాలయం వెనక భాగంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. నరసింహుడు బుధవారం ఉదయాన్నే పశువుల గుడిసె పైకి ఎక్కి పట్ట కప్పుతుండగా ప్రమాదవశాత్తు జారీ కింద ఉన్న బండల పై పడడంతో తలకు ముఖానికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. తీవ్ర గాయాలకు గురైన నరసింహుడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హుటా హుటీన స్థానిక ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వెంటనే అక్కడి నుండి కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

“This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151.”